ధీక్ష

- ఖాదర్ షరీఫ్

మృదువుగానే వ్యవహరించాడతను.

ఏదయినా జరగనీ. దేన్నయినా జయించగల్గిన శక్తినిచ్చాడు. చిన్నప్పటి నుంచీ చీకటికి భయపడి ముడుచుకుపోయేదాన్ని. నిర్భయంగా నడవటం నేర్పించాడు. జయాపజయాల పర్వాన్ని విప్పాడు. ''నీకు చాలా ధైర్యం ఎక్కువ'' అతని చేతులు నా ముంగురుల్ని సవరిస్తున్నాయి.

''నువ్విచ్చిందే...'' ప్రేమగా అతన్నే అల్లుకుపోయాన్నేను.

అన్ని వందల మందిలోంచి నన్ను తప్పించి ఎంత నేర్పుగా తీస్కెళ్ళాడనీ. కనీసం అక్కకి కూడా తెలియనివ్వకుండా. మరలా తాళి కట్టే సమయానికి సిటీ అంతా తిప్పి కళ్యాణమంటపం దగ్గరే దిగబెట్టాడు.

బైక్ మీద అతన్నే అంటుకుపోయాను.

''చలివేస్తుందా...స్పీడ్ తగ్గించనా'' అన్నాడు.

''అక్కర్లేదు...నిన్ను కప్పుకున్నాను కదా...'' అతని చెవి దగ్గర మత్తుగా పల్కుతున్నాయి నా మాటలు.

ఆ రోజు ఊరికి దూరంగా చెరువు దగ్గరికి తీస్కెళ్ళాడు. సిటీని వెలుగుతో నింపుతున్న లైట్లన్నీ చెరువులో పడి స్నానం చేస్తున్నాయి.

భలే సందడి చేస్తాడు. కానీ అతనికి నా దగ్గర భయం ఎక్కువ. నటిస్తాడేమో కాదు...కాదు. భలే అబద్ధాలు చెప్తాడు. ఒక సందర్భం చెప్తే అందులో వంద అబద్ధాలే ఛీ...ఛీ...కాదు...పాపం నిజాలే.

చాలా సేపు నన్ను ఎదురుగా పెట్టుకుని బండిస్టాండు వేసి దానికి ఆనుకుని అలాగే నిలబడి చూస్తూ ఉండిపోయాడు. వెన్నెల్లో నన్ను చలిగాలి వీస్తుంటే నేనే అతనికి దగ్గరగా వెళ్ళి అతని భుజం మీద చేయివేశాను. శరీరం నుంచి ఏవో సన్నని ప్రకంపనల్ని గమనించాను.

''కాస్త ముందుకి నడుద్దాం...'' బహుశా నేను మత్తుగా మాట్లాడుతున్నట్లు నాకే అన్పించింది.

''వద్దు. మనకు అలవాటులేని ప్రాంతం కదా....'' అతనికి భయం ఎక్కువని నాకు తెల్సు.

దూరంగా రోడ్డుమీద వెళ్తున్న వాహనాలు చీకటిలో మిణుగురు పురుగుల్లా సంచరిస్తున్నాయి. అతని శరీరం నుంచి వస్తున్న 'పాయిజన్' పెర్‌ఫ్యూమ్ వాసన నన్ను అతనికి మరింత దగ్గరగా చేరుస్తూ ఉంది.

అతని చెంపల మీదకి నా పెదవుల్ని చేర్చిన తర్వాతగానీ నాకు అర్థంకాలేదు. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఎంత వేడిని నింపుకుని ఉన్నాయో. మరింత ముందుకు వచ్చి అతని పాదాలమీద నా పాదాల్ని ఉంచి నిలబడి అతనిలోకి ఒదిగాను.

వెన్నెల పుప్పొడి మొత్తం మా దేహాల్ని పూర్తిగా తడుపుతూ ఉంది. రహస్యంగా నాల్గు పెదవులు ఎంతసేపు ముచ్చటించుకున్నాయో తెలియలేదు.

నాలో ఏదో వెదకడానికి ప్రయత్నించాడు. నేను పూర్తిగా తలుపులు తెరిచి ఆహ్వానించాడానికే సిద్ధపడ్డా.

అతని చూపుడు వేలుతో నా కనురెప్పల మీద కవిత్వం వ్రాశాడు. దుఃఖంలో స్నానిస్తున్న నన్ను పక్కకి తెచ్చి తన వెచ్చని స్పర్శతో ఆరబెట్టాడు. మనసు పరిమళాన్ని పర్చి వదిలిన వాడికి వల్లే అతని హృదయానికి ఏదో గుచ్చుకున్నందువల్లనేమో తన రెండు చేతులతో నా భుజాల్ని పట్టుకుని నన్ను ఒక్క అడుగు వెనక్కి నెట్టి నా వక్షస్థలం మీద వ్రేలాడుతూ తనని బాధకి గురిచేసిన దాన్ని చీకట్లో తడిమాడు.

''ఏంటిది...'' ఎందుకో హఠాత్తుగా అతను మామూలు స్థితికి వచ్చాడేమో అన్పించింది.

''మంగళ సూత్రాలు...''

దూరంగా ఏదో మెరుపు మెరిస్తే అతని కళ్లలోకి సూటిగా చూశాను. అతను తలదించుకుని మోటర్ బైక్ తాళాన్ని ఆన్ చేస్తూ అలాగే నిలబడి పోయాడు. చీకట్లో నా కళ్ళు తడవడం బహుశా గమనించి ఉండడు అనుకున్నా కానీ...

ఇందాక కవిత్వం వ్రాసిన చూపుడు వేలితో నా కన్నీళ్ళను తుడిచి ''పద బయల్దేరదాం...'' అన్నాడు బైక్ స్టార్ట్ చేసి.

నేనిక్కడ ఒక నిజం చెప్పాలి. అతన్ని నేను ప్రేమిస్తున్నాను.

ఇది నిజమే అయితే నేనిప్పుడు బ్రతికే ఉన్నాను. స్మశాన వాటి కలోంచి నన్ను పెకిలించి మరలా జీవాన్ని నింపింది అతనే అయితే నేను జీవించే ఉన్నాను. అద్దంలో చూసుకుని ఏడుస్తున్న ప్రతిసారీ ఏమీ జరగనట్టు ప్రపంచం ముందు తిరుగాడే నేను తడిసిన కనురెప్పల్ని ఎన్నిసార్లు నా పవిటచెంగుతో హత్తుకున్నానో... అన్నిసార్లు నేను అతన్ని ప్రేమిస్తున్నాను.

ఒంటరిగా నన్ను అసహాయురాల్ని చేసి చీకటిలో నాతో యుద్ధం చేసి గెలుపు గుర్రాన్ని ఎక్కి వెళ్ళిపోయే ఆ కిరాతకత్వం అనుభవించిన దాన్ని.

నన్ను వెన్నెల్లో తిప్పిన వాడిని నేను ప్రేమిస్తున్నాను.

ఒక సర్ప పరిష్వంగాన్ని చూసిన తర్వాత, అనుభవించిన తర్వాత...అతను కలిశాడు. చలనమున్న చేతులతో నాకు కరచాలనం చేశాడు. ఎంత మధురం.

అతని ఒడిలోకి చేరిన ప్రతిసారీ అమ్మ పాలిండ్ల మీద తల ఆన్చి సేదతీరినట్టే ఉంటుంది. మనసున్నందుకు...మనిషిగా నన్ను చేసినందుకు అతన్ని నాలోకి ఆహ్వానించాల్సిందే.

మొదట్లో అతనికీ నాకూ మధ్య చాలా దూరం. అసలు సహవాసమే లేదు. ప్రేమా లేదు. ఎలాగో ఏమో అర్థంకాదు ఇప్పటికీ వేకువనే వచ్చి నా నిదుర కళ్ళమీద వచ్చి కూర్చునేవాడు. మెలకువరాగానే మంచుకరిగిన జ్ఞాపకంలా వెళ్లిపోయేవాడు.

నా కంటే అక్కకే అతనితో ఎక్కువ సాన్నిహిత్యం. వాళ్ళిద్దరూ ప్రపంచ పుస్తకాన్ని తలకిందులుగా చదువుతున్నట్లు తోచేది. ఎప్పుడయినా మధ్యలో నేను వెళ్తే కాస్త విసుక్కున్నట్లుగానే ప్రవర్తన ఉండేది. బ్రతుకుని గురించీ, జీవితాన్ని గురించీ ముచ్చటించుకునే వాళ్ళు. వాళ్ళిద్దరూ స్వతంత్రభావాల్ని కల్గి ఉండేవాళ్ళు గదా.

మాటల్లో ఇద్దరికీ నిర్భయం.

నాకూ ఆసక్తిగా

ఉండేది. అతని మీద కంటే అతని మాటల మీదనే. ''నువ్వు మాటల్తోనే గెలుస్తావ్'' అన్నానోసారి.

''ఎవర్నీ నిన్నా''... అంతే... గుండె వేగంగా కొట్టుకుంది.

ఆ రాత్రి కరగలేదు.

నిమిషమయినా వృధా చెయ్యకుండా చూపులన్నీ నా చుట్టూరా చల్లేవాడు. నేను లేనప్పుడు తాను అనుభవించిన నిరీక్షణని ఆలోచనలు ఎవరి చుట్టూరా తిరిగిందీ చెప్పి తన జీవితం విశ్వాసాన్ని కోల్పోతుందేమోనని బాధపడేవాడు.

నా ఒంటరితనం పటాపంచలయ్యేది. రేయీ పగలూ అతను కన్న కలల్ని చెప్పి వెళ్ళిపోతే వాటి మీద నేను పడుకుని ఆదమరచి నిద్రపోయేదాన్ని.

నన్ను ప్రేమించినట్టుగానే నా కూతుర్నీ ప్రేమిస్తాడు నిశ్శబ్దంగా చిరునవ్వుతో. ఈ రోజు వస్తాడూ... రాడూ అనే ఆలోచనలలోనే దహించబడేదాన్ని.

''నువ్వే నా బయటి ప్రపంచం...లోపలి ప్రపంచం అన్నీ'' అన్నాను.

''నేనే అంటే నా కంటే నువ్వే ఎక్కువ అబద్ధాలు చెప్తావు...''

ఎలా నమ్మించను నేను గడియారంలో తిరగే సెకన్ల ముల్లుతో పోటీపడి అతని వెంట వెళ్తాంటాయి నా ఆలోచనలు. అక్కడెక్కడో ఎవడో బైక్ మీద పడిపోయాడంటే నేను నిద్రాహారాలు మాని అతనొచ్చేవరకు ఎందుకు మనిషిని కాలేకపోయాను.

ఎప్పుడయినా ప్రయాణంలో ఎదురుపడ్డ ఏ చెరువుని చూసినా అప్పటి ఆ మధురమయినా రాత్రి ఎందుకు గుర్తుకు వస్తుందో ఎలా ప్రశ్నించను.

ఎవరికోసమో నేను అన్నం వండివార్చి ఈ భూమి మీద ముళ్ళ చెట్టులా నిలబడి బ్రతుకుతున్నప్పుడు. ఈ చెట్టుకి మిత్రవాక్యాన్ని కట్టిన అతన్ని ఎలా నమ్మించను నేను.

ఓ రోజు బాగా అలసిపోయి వచ్చాడు అక్క దగ్గరికి.

''ఏమయింది...'' ఎంత రహస్యంగా పలుకరిద్దాం అనుకున్నా కుదర్లేదు.

''సరిహద్దుల్ని కొలుస్తున్నాను...''

''ఎవరివి...''

''జీవితానివీ...మన బ్రతుకులవీనూ...'' శూన్యంలోకి చూస్తూ అన్నాడు.

నా వల్లకాలేదు. ఎవడెట్టా ఛస్తే నాకేంటి. మనసు అస్తవ్యస్తమయింది. నన్ను ఓదార్చే అతన్ని నేనెలా.... అసహాయత. అతన్ని నా వక్షస్థలానికి హత్తుకోలేని అసహాయత. అలాగే వెళ్ళిపోయాను ఇంటికి. ప్రేమ లేకుండానే.

ఎందుకు వచ్చేశాను. ఎందుకు భయపడాలి. ఎవరికి భయపడాలి. ఎవరో ఏదో అనుకుంటారని ఎందుకు నా కలల్ని నేనే చంపుకోవాలి. అతని ఒక్క స్పర్శ తప్ప ఎవ్వరూ నా దుఃఖాన్ని నా నుంచి వేరు చేయలేరు అని అర్థమాయ్యక నేను ఎందుకు వెనకడుగు వేయాలి. ఎందుకు నేను మాత్రమే గుండెపగిలేలా దుఃఖించాలి.

ఈ శరీరం లోపల నాకూ ఒక మనసుందని అతను తెల్సుకున్నాడు.

నేను స్త్రీని అవును నా చుట్టూ సవాలక్ష సందేహాల ముళ్ళకంప చుట్టబడింది. ఇది బ్రతుకు అధ్యాయం. మూడు ముళ్ళ వచనం. పావురంలా ఎగురుతున్నప్పుడు ఎంత హాయి అతనితో.

దీనంతటికీ అమ్మే కారణం. బంధాలకు లొంగిపోయింది. బాంధవ్యాల ఛట్రంలోంచి బయటకి తొంగిచూసే శక్తిలేక ఆ సాహసం చేయలేక నన్ను ఒక నరకంలో బ్రతకమని శాసించింది.

ఎన్నోసార్లు గొంతు విప్పి అమ్మ గుండెల మీద వేద్దామనుకున్నాను.

అమ్మా! చూశావా వీళ్ళంతా ఎంత కర్కశంగా నీ మీద ఎంత కపట ప్రేమని కురిపించారో...ప్రేమ నటిస్తున్న క్షణంలో మోసపోయి నన్ను వీళ్ళకు బలిదానం చేశావు బంధాలను తెంచుకోలేక మనిషితనం చచ్చినవాడితో మూడు ముళ్ల బంధాన్ని మెడకు తగిలించుకుని నీకూ నాకూ మధ్య నిర్మించిన బందిఖానాలో బ్రతుకీడుస్తున్నాను.

వీళ్ళు నిన్నూ, నన్నూ ఒక్క క్షణమయినా సంతోషంగా ఉంచారా? మమకారాల సముద్రాన్ని తోడిచ్చానని సంబరపడ్డావు.

కానీ మా మధ్య ఎప్పుడూ పువ్వులు విచ్చుకున్నంత స్పష్టంగా ప్రేమ చిగురించలేదు. శరీరంతో మాత్రమే మాట్లాడేవాడికిచ్చి కట్టబెట్టావు. వాడికి మనసుతో ఏం పని. సూటిపోటి మాటలతో గుండె గాయమయింది. నా ఆశలూ కోర్కెలూ కల్లలై బాధల్తో బ్రతుకు బండరాయే అయింది.

అమ్మా! నువ్వు నన్ను శపించే ఉంటావు. మానవత్వం లేని ఈ బంధుత్వం మధ్య బ్రతకమని కన్నీళ్ళు నిండిన కళ్ళతో గుటకలు మింగుతూ ఒక్క పూటైనా కడుపునిండా కూడు తినలేదే ఎప్పుడూ కలతనిద్రే నాకు నేనే ప్రశ్ననై, జవాబునై, నాకు నేనే ఓదార్పై కాలుతున్న అగ్నిగుండమే అయింది బ్రతుకు.

చివరకు కాల్తున్న కట్టె మాత్రమే నన్ను ప్రేమగా హత్తుకుంటుందేమో. ఎన్ని రాత్రులు గడిచిపోయాయో. ఎన్నో దినాలు ఈ బ్రతుకుని పలకరించి వెళ్ళిపోయాయి. చనిపోవాలనుకున్నాను.

''చావకూడదు...బ్రతుకుని జయించాలి జీవితాన్ని భుజం మీద ధరించాలి...'' నా గుండెలోని బరువునంతా అతను ఒక్కో మెట్టూ దించుకంటూ వచ్చాడు.

చాలా రోజులు అతను రాలేదు. కనీసం ఫోను కూడా లేదు. మధన పడ్డాను. అక్కని అడగడానికి ధైర్యం చాల్లేదు. అడగాలనే గట్టి నిర్ణయానికి వచ్చా. ''తను... ఈ మధ్య రావటం లేదేం అక్కా...'' నా గొంతు స్థాయి చాలా తగ్గింది ఎందుకో

''ఎవరు...?'' అక్క ఏదో రాస్కుంటూ మరో ఆలోచనలో ఉన్నట్టు అడిగింది. నాకు తెల్సు ఆవిడ కావాలనే అలా ప్రవర్తించిందని.

''తనే...అక్కా ''స్మైల్'' గొంతుకి ఏదో అడ్డుపడి మరలా విడిపోయింది.

చాలా సేపటి వరకూ అక్క నుంచి సమాధానం లేదు. రాదేమో అనుకున్నా అక్క రాయటం పూర్తయిందన్నట్లు పెన్ను క్యాప్ వెతికి గట్టిగా బిగించింది. పేపర్లు నీట్‌గా సర్ది కళ్ళచోడు తీసి పవిటతో కళ్లు, అద్దాలూ రెండూ తుడిచి మరలా కళ్ల మీదకి చేర్చింది.

''స్మైల్ విషయంలో నీకు ఎందుకంత ఆసక్తి'' అక్క మామూలుగా అడిగినా అందులో కాస్తంత అనుమానం తొంగిచూస్తూనే ఉంది.

''ఏం లేదక్కా ఈ మధ్యరావటం లేదుకదా.. అందుకని'' నా చూపుల నేలని తాకుతున్నాయి.

''నేనే రావద్దన్నాను. ఎందుకో కొన్ని పరిచయాల్ని కొంతకాలం కొనసాగించకపోవడమే మంచిదనిపించింది...'' ఆవిడ గొంతులో కొన్ని మార్పుల్ని గమనించా.

''ఎందుకు...''

''ఎందుకో నీకు తెలీదా?...''

''తెలీదు...'' నా చూపులు నేలనే అతుక్కుపోయాయి.

''మొన్న రాజేశ్వరి ఫోన్ చేసి చెప్పింది. నా జాగ్రత్తలో నన్నుండమని. కొన్ని విషయాలకి కారణభూతురాల్ని నేనే కావటం నాకే మాత్రం ఇష్టంలేదు'' అక్క చెప్పటం పూర్తిచేయలేదు. పూర్తయిందన్నట్లుగానే మాట్లాడింది.

''అభిషిక్త! నేను నీకీ విషయం చెప్పాలా వద్దా అనుకుంటూనే ఉన్నా. నీకు పెళ్ళయింది. అతనికీ పెళ్ళయింది. ఏంటి స్నేహాలు, పరిచయాలు... సంబంధాలు...''

గది మౌనం దాల్చింది.

ఫ్యాను తిరుగుతున్న రెక్కల శబ్దం తప్ప గదిలో ఏదీ విన్పించనంత నిశ్శబ్దం.

''అంటే నీ జాగ్రత్త కోసం రావద్దన్నావన్న మాట...''

''నీ మంచికోసం కూడా'' అక్క మాటలు నన్ను ఎలాగో మలచాలని ప్రయత్నిస్తున్నాయి

''అతని స్నేహం లేకుండా నేను ఉండలేనక్కా'' బహుశా నా గొంతుక నూతిలోంచి మాట్లాడుతున్నట్లు నాకే అన్పిస్తుంది.

''ఇంకా ఎంతో నయం అతనే లేకుంటే బ్రతకలేను అన్లేదు..''

''కాదు బ్రతకగలను...కానీ జీవించలేను. నువ్వే అన్నావ్ కదా. బ్రతకడం వేరూ జీవించటం వేరూ అని...''

''నాతో వాదించకు అభీ! ఇలాంటివి చర్చించటం నాకు ఇష్టం ఉండదు. అతను లేకుండా ఉండలేను అనటం ఎంత అనైతికం'' అక్క నన్ను మందలించింది.

''భలే చెప్తున్నావ్ అక్కా నైతికాన్ని అనైతికాన్ని నా కంటే నువ్వే బాగా చదివావ్. నీకే ఎక్కువగా తెల్సు. ఒక క్రూర మృగం సాధుజంతువుని బలవంతంగా పడగ్గదిలోకి లాక్కెళ్ళడాన్ని ఏమంటారు.

తలవంచుకుని తాళి కట్టించుకుని గతం పెట్టిన గాయాల గుర్తుగా మిగిలిపోయి చనిపోవాలనుకున్న నన్నే మంటారు. కన్నీళ్ళే ఖడ్గాలై నా గొంతుకని కోయడానికి సిద్ధపడ్తున్నప్పుడు అతను తన అరచేతిని అడ్డంగా పెట్టాడు. దీన్నేమంటావు. పరిచయం అంటావా, స్నేహం అంటావా. నువ్వు వాడే ఒక పదం ''సంబంధం'' అంటావా. ఏమంటావ్.''

''వాడు నీకు బాగా మాటలు నేర్పాడు'' కోపం వ్యంగ్యం రెండూ కల్సి అంది అక్క.

''అన్నీ నేర్పించాడు. నా బాధల్ని పూర్తిగా కడిగి నన్ను హత్తుకున్నాడు. లాలించాడు. ప్రేమించాడు. కాసింత ప్రేమని నాకు పంచాడు. అవును మా మధ్య సంబంధం ఉంది. ఎక్కడో దూరంగా అంటీ ముట్టనట్టు ఉంది. ఆ అంతరమే మా మధ్య సరిహద్దురేఖల్ని గీస్తుంది...''

''అంటే... వాడితో వెళ్ళిపోతావా?''

''అవును అసలిప్పటికే వెళ్లిపోయాను. భార్యల్ని వ్యభిచారులుగా చేస్తున్న ఈ గదుల్ని మరీ కూల్చి వెళ్తాను...''

నా మనసుమీది ముసుగు తొలగిపోయింది. చిత్రం అక్క ఏడుస్తూ ఉంది. భూమిని తన్నుకుని పైకెగస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేక ఏడుస్తూ ఉంది.

సమరంలో అశక్తురాలిగా మిగిలిపోయి రోదిస్తూ ఉంది.

''అక్కా'' అక్క భుజం మీద చేయివేసి పక్కన కూర్చున్నాను. చాలా సేపటికి అక్క పెదవి విప్పింది.

''అభీ..మనం బాధల స్తనాల బరువుని హృదయం మీద మోస్తున్న వాళ్ళం. వాటి బరువు దిగదు. నీకైనా నాకైనా. మనకు రెక్కలు లేవు. ముసుగులే ఉన్నాయి. ముసుగుని నువ్వు విసర్జించావ్. సంతోషమే...కానీ అతని జీవితంలోకి నువ్వు అడుగుపెట్టిన తర్వాత కాస్త అస్తవ్యస్థత చోటుచేసుకుంటుంది. నిన్ను పెరగనివ్వనీ... ఎదగనివ్వని. ఈ ప్రపంచం నిన్ను సుఖంగా కూడా బ్రతకనివ్వదు.

మనలోని హృదయాన్ని పసిగట్టిన వ్యక్తిని మనం ప్రేమించడంలో అర్థం ఉంది. కానీ... అందులో ఎంత వరకు న్యాయం ఉందో... వెతుకు...''

ఆ రాత్రి కూడా నేను నగ్నంగా పడగ్గదిలో పూజింపబడ్డాను.

గాయం మీదే వాలడానికి ఇష్టపడే ఈగలు ఈ మొగుళ్ళు. సుఖాలకోసం ఊగిపోతారు. సుఖాలతో తేలి ఆడ్తారు. సుఖాల వీణని అపస్వరాలు పల్కించి ఆనందంతో ఊగిపోతారు. పువ్వు మీద తుమ్మెద వాలినంత సున్నితత్వం వీళ్ళలో లేదు.

అయినా..

చీకటిలో వెలుతురులాగా నా మనసులో ఏదో ఆశ ఏదో ఒక రోజు నన్నూ, నా మనసుని రాక్షసుడే అర్థం చేస్కుంటాడనే నమ్మకం. ఊహల్లో ఊయల తాగుతూ ఊరట చెందడమే నా వంతు. మెడలో పొదిగిన ముళ్ళు మనసులో గుచ్చుకుంటాయని ఏ స్త్రీ అనుకోదు. బ్రతుకు నమ్మకం మీద నడిచే బండి లాంటిది. నమ్మకం వంతెనలా బ్రతుకుని కాపాడుతూ వస్తూ ఉంది. ఆ నమ్మకమే కూలిపోయిన రోజున స్త్రీకి ఓదార్పు అవసరం. తప్పకుండా అవసరం. దాని కోసం ఆరాటపడ్తుంది. వెతుక్కుంటుంది. దొరకబుచ్చుకోవడానికి ప్రయత్నిస్తుంది. దొరకని రోజున చస్తుంది. అంతే.

ఈ బ్రతుకుని ఏం చేస్కుంటాం మనం జీవితంతో రాజీ కుదరనప్పుడు.

ఈ మనసుని ఎక్కడ దాచుకుంటాం అంతా గాయాల సమూహమయినప్పుడు.

ఈ ప్రకృతిలో ఉండే సత్యం ఏంటంటే.... చెట్టుని పెంచిన దానికి కాయని కోయడం కూడా తెల్సు.

★

శ్రియ వింత కోరిక

పుర్రెకో బుద్ధి...జిహ్వకో రుచి అన్నారు. ఒక్కోరికి ఒక్కో రకమైన కోరికలుంటాయి. అవి తమ స్వంత అభిరుచులు అనుకోకుండా అందరికీ ఆపాదించడం కొందరికే సాధ్యం. అలాంటి వారిలో శ్రియని ప్రముఖంగా చెప్పుకోవచ్చు. తనకు కలిగిన కోరికలే అందరికీ కలుగుతాయన్న భ్రమలో వుంటోందని సినీ విశ్లేషకులు అంటున్నారు. అభిమానుల కలల రాణి అయిన శ్రియ తన స్నేహితులతో కలిసి ఇటీవల గోవా వెళ్లింది. దీనికి ఇంత గొడవ దేనికీ? అనుకుంటున్నారా? వుంది. గోవా వెళ్లొచ్చి కామ్‌గా వుంటే ఏ సమస్యా వుండకపోను. కానీ గోవా వెళ్లి వచ్చిన దగ్గర నుంచి రకరకాల స్టేట్‌మెంట్లతో అందరి బుర్రలు తింటోందని తెలిసిన వారు అంటున్నారు. గోవా గురించి శ్రియా మాటల్లో వినండి.

''స్నేహితులతో కలిసి ఎంజాయ్ చేయడానికి గోవాను మించిన అనువైన ప్రదేశం మరొకటి లేదు. మిగతా టూరిస్ట్ ప్లేస్‌ల్లో స్నేహితులతో కలిసి వెళితే ప్రత్యేకంగా గమనిస్తారు కానీ గోవాలో అలా కాదు. మన గురించి పట్టించుకునే వారు అక్కడ ఎవరూ వుండరు. చివరిగి నగ్నంగా తిరిగినా ఎవ్వరూ పట్టించుకోరు. మనసులో మాటలు వెల్లడించడానికి గోవా అనువైన స్థలం. నా దృష్టిలో స్త్రీలందరూ ఒక్కసారన్నా తమ స్నేహితులతో కలిసి గోవా వెళితే మంచిదని నా అభిప్రాయం'' అంటోంది. తను గోవా వెళ్లడం...అక్కడ ఎంజాయ్ చేయడం వరకూ ఓకే... కానీ అందరిని అక్కడికి వెళ్లిరమ్మనడం ఏమిటి? అని కొందరు చెవులు కొరుక్కుంటున్నారు.